# మేనెల ఎ. పి. ఎక్స్‌ప్రెస్

**వెం**కట కృష్ణారెడ్డి ఒక మెకానికల్ ఇంజనీర్. అంతపెద్దదీ, చిన్నదీగాని మధ్యస్తం ఫ్యాక్టరీని పటాన్ చెరువులో స్థాపించి డబ్బు బాగాసంపాదిస్తున్నాడు. బంజారాహిల్స్‌లో ఒక భవనం నిర్మించుకొని స్వంత భార్యతో, ఇద్దరు మగపిల్లలతో సగటు మానవుడికెదురయ్యే ఎటువంటి సాధారణ ఇబ్బందులు లేకుండా, మనిషి ఆశించే సమస్త సుఖసౌకర్యాలను అనుభవిస్తూ సంతృప్తికర జీవితాన్ని గడుపుతున్నాడతడు. భార్య పేరు పద్మావతి. ఆమె నిత్యం సంతోషవతిగానే ఉంటుంది. ఆమె సంతోషందేని గురించి? తన భర్త, తన పిల్లలు సంతోషంగా ఉంటే అదే ఆమె సంతోషం. తమ పిల్లలైన, హరీష్, గిరీష్ పేర్లకు చివరన ఉద్దేశ పూర్వకంగానే 'రెడ్డి' అన్నకులసంకేతాన్ని చేర్చలేదా దంపతులు. వెంకట కృష్ణారెడ్డికి అలాంటి ఆధునిక భావాలు చాలా ఉన్నాయి. పిల్లలిద్దరూ చదువుపట్ల శ్రద్ధచూపుతారు. లిటిల్‌ఫ్లవర్ జూనియర్ కాలేజీలో యం.పి.సి గ్రూపులో ఉన్నారు వాళ్ళు. తండ్రిలాగా ఇంజనీర్ కావాలన్నదే వాళ్ళ అభిలాష. రెండో సంవత్సరం తర్వాత ఐ.ఐ.టి. ఎంసెట్ ప్రవేశ పరీక్షలు వ్రాయటానికి ఇప్పటినుంచే సంసిద్ధులవుతున్నారు వాళ్ళు.

పద్మావతి అక్క లీలావతి చాలా కాలం నుండి ఢిల్లీలో ఉంటున్నది, ఆమె భర్త పరమేశ్వరరెడ్డి. ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఒక సీనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీళ్ళ ఏకైక సంతానం 'అనురాధ'కు వయస్సు ప్రస్తుతం ఇరవైమూడు. ఫైన్ ఆర్ట్స్‌లో ఎం.ఏ పాసైన ఆ సుందరీమణి కొంతకాలంగా ప్రేమబంధంలో చిక్కుకు పోయిఉంది. ఆ అబ్బాయి చక్కనివాడు, దృఢమైన శరీరం కలవాడేగాక ఐ.ఏ.యస్ కూడాను. ఆంధ్ర ఆవకాయ, గోంగూరలంటే మిక్కిలి ఇష్టపడే వాడైనా గూడా అతను

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బ్రాహ్మణ కులస్థుడు కావటంవల్ల అనురాధ తల్లిదండ్రులకు ఈ సంబంధంపట్ల పెద్దగా ఆసక్తి ఉండేదికాదు. కానీ, పోస్టు గ్రాడ్యుయేట్ అయిన ఒక అమ్మాయి చేసుకొన్న నిర్ణయాన్ని మార్చటం బ్రహ్మదేవుడి వల్లకూడా కాదన్న సత్యాన్ని లీలావతి పరమేశ్వర దంపతులు కొంతకాలం తర్వాత తెల్సుకోగలిగారు. ఇంకా ఆలస్యం చేయటం ఎందుకు? నిరాడంబరంగా నిశ్చితార్థ కార్యక్రమాన్ని జరిపించి మే 25న కళ్యాణం జరపాలని నిర్ణయించుకొన్నారు. ఈ శుభవార్తను గూర్చి లీలావతి వ్రాసిన సుదీర్ఘమైన లేఖ పద్మావతికి ఫిబ్రవరి 15న చేరింది. ఇహ పద్మావతికి మరో ఆలోచన లేకుండాపోయింది. ఎంత త్వరగావీలైతే అంత త్వరగా ట్రైన్‌కు టికెట్లు రిజర్వ్‌చేయమని భర్తను వత్తిడి పెట్టసాగింది. మే 18న అక్కడికి చేరేట్లుగా, ఒకరోజు ముందు అంటేమే 17న ఇక్కడనుండి బయలు దేరేట్లగా ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ ఎ.సి. స్లీపర్ క్లాసులో నాలుగు బెర్తులు బుక్‌చేయటం జరిగింది. ఆమె తదుపరి పెట్టుకొన్న కార్యక్రమం భర్తకు, పిల్లలకు నూతన బట్టలు కుట్టించటమే. తనకు, తన అక్కకు, అక్కకూతురుకు కావాల్సిన చీరలు కొనటంలో గూడా ఆమె ఎటువంటి పిసినారితనం చూపలేదు. సన్నాహాలు ఇట్లా జరిగిపోతుండగా పద్మావతి, తన అక్కతో దాదాపు ప్రతిరోజూ ఫోన్‌లో వివాహ ఏర్పాట్లుగూర్చి మాట్లాడు తుండటమేగానీ, తన ఆలోచనల్నిగూడా తెలియజేసేది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్, మే నెలల్లో ప్రతినెలకూ వెంకట కృష్ణారెడ్డి టెలిఫోన్ బిల్లు పదివేలకు తక్కువైయుండదు. ఢిల్లీ ప్రయాణం సమీపిస్తున్న కొద్దీ పద్మావతిలో గాభరా అధికం కా సాగింది. పెండ్లి కూతురుకు హైద్రాబాద్ డిజైన్లలో కొన్ని బంగారు ఆభరణాలను గూడా తయారు చేయించింది. కాని ఈ విషయం పద్మావతి అక్కతో ఎప్పుడూ చెప్పలేదు. ఢిల్లీ వెళ్ళింతర్వాత ఒక 'సర్ప్రైజ్ గిఫ్ట్'గా వాటిని ఇవ్వాలని ఆమె ఉద్దేశ్యం.

ప్రయాణ తేదీ కొఱకు ఎదురు తెన్నులో చూస్తూకూర్చుంది పద్మావతి. అలాఅలా మే 16వ తేదీ వచ్చింది. పద్మావతిలో గాభరా మరింత అధికమైంది. మరుసటిరోజు ఉదయం కనీసం నాలుగు గంటలకే అందరూ లేవాలి, స్నానపానాదులు ముగించి అయిదు గంటలకల్లా నాంపల్లి స్టేషన్‌కు చేరుకోవాలి. బంజారాహిల్స్ భవనం నుండి నాంపల్లి స్టేషన్‌కు దాదాపు పదిహేను ఇరవై నిమిషాలు చాలు, ట్రైన్ ఆరుగంటల తర్వాతనే బయలుదేరుతుంది కాబట్టి, అయిదుగంటల తర్వాత బయలుదేర వచ్చని భర్త చెప్పినా అయిదుగంటల కల్లాస్టేషన్‌కు చేరుకోవాలన్నదే పద్మావతి తపన.

''స్టేషన్‌వరకూ నడిచివెళ్ళాలనా నీ ఉద్దేశ్యం?'' అని అడుగుదామని అనుకొన్నా, భార్యను ఆటపట్టించటానికి అతనిమనసు అంగీకరించలేదు. రాత్రి అందరూ త్వరగా

నిద్రపోవటం, ఉదయం 3 ½ గంట లకే అలారంసెట్ చేసుకోవటం, ఇదే సమయానికి 'వేకప్‌కాల్' ఇవ్వటానికి టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌వారిని కోరటం, ఇవ్వన్నీ పద్మావతి చేసుకొన్న ఏర్పాట్లు. ఇవ్వన్నీ కాకుండా ఉదయం 3 ½ గం.లకే లేపాలని పనిమనుషులతో కూడా చెప్పటం జరిగింది.

ఉదయం 5 గంటలకు ఆ ఇంటినుండి నాంపల్లి స్టేషన్‌కు కారు మామూలు వేగంతోనే వెళ్ళింది. నిద్ర చాలనట్లు బద్ధకంగా పడుకొని ఉన్న ఎ.పి.ఎక్స్ ప్రెస్ ఎ.సి.స్లీపర్‌లో తమ తమ బర్త్‌లక్రింద సామన్లను సర్దుకోవటం జరిగింది. బర్త్‌ల నెంబర్లు 7,8,9,10 కావటంవల్ల తమ కంపార్ట్‌మెంట్‌లోకి వేరే వారెవ్వరూ రారనే సంతోషంకల్గింది పద్మావతికి. కాని ఆ సంతోషం అట్టేకాలం నిలబడలేదు. పది నిమిషాల తర్వాత ఇద్దరు యువకులు వచ్చి, 9,10 బర్త్‌లు తమవని మర్యాదపూర్వకంగా చెప్పటం జరిగింది. పద్మావతి గుండెలు గుభేలుమన్నాయి. భర్తచేతిలోని టికెట్‌ను తీసికొని తమనెంబర్లు అవేనని ఆమె నిర్ధారణకు రాగలిగినా, ఇటువంటి ఎ.సి. స్లీపర్ మరో బోగీ ఏదైనా ఉన్నదేమోనన్న అనుమానం కల్గింది. ఈ మధ్యలో ఆ యువకులు వెళ్ళి టి.టి.ఇని తీసుకువచ్చారు. టి.టి.ఇ అడిగిన వెంటనే వెంకట కృష్ణారెడ్డి తమ టిక్కెట్టును అతనికిచ్చాడు. టికెట్‌ను నిశితంగా పరిశీలించి వెంకటకృష్ణారెడ్డిని ఆపాదమస్తకం చూసి చిరునవ్వుతో ''ఈ టికెట్లను మీరెప్పుడు కొన్నారు?'' అంటూ ప్రశ్నించాడు.

మార్చినెలలోనే కొన్నామని అతను సమాధానమిచ్చాడు.

''అయితే ఏప్రియల్ 17న ఈ టికెట్‌ను మీరు వాడలేదన్నమాట'' అని టి.టి.ఇ ఆశ్చర్యం వ్యక్తపర్చగా, రెడ్డి నిశ్చేష్టుడైనాడు, పద్మావతికి విసుగు మొదలైంది.

''ఇది లాస్ట్‌మంత్ టికెట్‌సార్, దీనిని ఒకసారి చూడండి'' అంటూ టి.టి.ఇ తేదీ చూపగానే రెడ్డికి జరిగిన పొరపాటు తెలిసొచ్చింది. ఏ.సి.స్లీపర్‌లోగానీ, ఏ.సి ఫస్ట్‌క్లాస్‌లోగాని మరేదైనా క్లాసులోగానీ, ఢిల్లీవరకూ వెళ్ళటానికి వీలవుతుందా అని అడగగా

''సార్... ఈ ట్రైన్‌లో ఒక్క బెర్త్‌గూడా దొరకటానికి ఎలాంటి ఛాన్సులేదు, వెయిటింగ్ లిస్ట్‌లో గూడా చాలామంది ఉన్నారు. ఇంకావచ్చే పదిహేనురోజుల వరకూ ఏ.పి.ఎక్స్‌ప్రెస్‌లో ఒక బెర్త్‌గూడా దొరికే సమస్యేలేదు.''

అని చెప్పేటప్పుడు ఆ టి.టి.ఇ వదనంలో ఒక జిల్లా కలెక్టర్ అధికార దర్పంతొణికి సలాడింది. తమ సూట్‌కేసులను ఒకొకటిగా ప్లాట్‌ఫారం మీదకు దించుకొన్నారు. పద్మావతి కన్నులు జలపాతాలే అయ్యాయి. ట్రైన్ బయటే ఉన్న డ్రైవర్‌కు ఈ విషయమేమీ అర్థంకాలేదు. అతనితో జరిగిన సంగతినంతా గిరీష్‌మెల్లగా చెప్పటం జరిగింది.

కార్లో ఎక్కిన మరుక్షణంనుండీ పద్మావతి వెక్కి వెక్కి ఏడ్వటం ఆరంభించింది.

''పద్మం ఛీ... ఛీ... పసిపిల్లల్లాగా ఇట్లా ఏడిస్తే ఎలా? మనం ఈ రాత్రికే ఢిల్లీ చేరుకొంటాం. ఇంటికి వెళ్ళి, సాయంత్రం ఫ్లైట్‌లోనే టికెట్లుబుక్ చేద్దాం. బాధపడకు'' అని చెప్పిరెడ్డి తన ప్రియమైన భార్యను ఓదార్చాడు.

కానీ, ఆరోజు సాయంత్రం ఫ్లైట్‌లో గూడా వాళ్ళకు టికెట్ దొరకలేదు. మరుసటిరోజు ఉదయం ఫ్లైట్‌లో వాళ్ళు, ఢిల్లీకి చేరుకొన్నారు.

మార్చి నెలలో ట్రైన్ టికెట్లు బుక్‌చేసిన సెక్రటరీని అతనుచేసిన పొరపాటుకు పెద్దగా మందలించలేదు. ఎందుకంటే టికెట్‌లో ముద్రింపబడిన తేదీని చూడటంగూడా తన బాధ్యతేనన్న విషయంలో అతని కెటువంటి సందేహం లేదుకనుక.

ఆరోజు వెక్కివెక్కి ఏడ్చిన పద్మావతి తర్వాతి రోజుల్లో ఆ అనుభవం గుర్తుకొచ్చినప్పుడల్లా పకపకమంటూ నవ్వేది.

---